


చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-గోపాలపురం

హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పేరా లీగల్ అడ్వకేట్ జె.చంద్రశేఖర్, సోషల్ వర్కర్ కలపాల శేషు అన్నారు. శనివారం గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సూచనలు మేరకు మండల న్యాయ సేవాధికార కమిటీ కొవ్వూరు వారి ఆధ్వర్యంలో విద్యార్థినిలకు లీగల్ అవేర్నెస్ క్యాంప్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిఎల్‌విజె.రత్న కిషోర్ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఓటర్ల జాబితా

జిల్లా కలెక్టర్ మాధవీలత

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు మేరకు ఓటర్ల జాబితా సవరణ విషయంలో నియోజక వర్గ ఎన్నికల అధికారులు పూర్తి నిబద్ధతతో కూడి విధులను నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్‌లో ఎస్-ఎస్ఆర్ 2024పై నియోజకవర్గ, మండల స్థాయి ఎన్నికల అధికారులు, సిబ్బందితో జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్, డిఆర్ ఒ జి.నరసింహంతో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ 2024 లో సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎస్ఎస్ఆర్ 2024 రూపొందించే క్రమంలో ప్రతి ఒక్కరూ హేతబద్ధీకరణతో కూడి ఓటరు జాబితా రూపొందించాల్సి ఉంటుందన్నారు. ఆ క్రమంలో మానవ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత, పాల్గొన్న జెసి

వనరులు, పోలింగ్ కేంద్రాలు, క్రిటికల్, వలరబుల్ పోలింగ్ కేంద్రాల, మౌలిక సదుపాయాలు పై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఓటర్లు నమోదు , తొలగింపు విధానం, సర్వీస్ ఓటర్ల నమోదు సంబంధించి జవాబుదారీ తనం కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ప్రతి మంగళ వారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ వారితో నియోజక వర్గ స్థాయి లో సమావేశం నిర్వహించాలని, బుధవారం జిల్లా స్థాయి లో నిర్వహిస్తామని తెలిపారు. నియోజక వర్గ ఎన్నికల అధికారులుగా అనపర్తికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (గెయిల్ (ఐ) లిమిటెడ్) ఎబివిఎస్‌బి శ్రీనివాస్, కొవ్వూరు (ఎస్‌సి)కి కొవ్వూరు ఆర్‌డిఒ ఎస్.మల్లి బాబు, రాజమహేంద్రవరం రూరల్‌కు ఆర్‌డిఒ ఓ.చైత్ర వర్షిణి, రాజానగరానికి స్పెషల్ కలెక్టర్ ఎస్.సరళా వందనం, నిడదవోలుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, పిఐపిఆర్ఎమ్‌సి యూనిట్-1, కొవ్వూరుకు కె.గీతాంజలి, గోపాలపురానికి (ఎస్ సి)స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్ ఎ) ఓఎన్‌జిసి, రాజమహేంద్రవరానికి టిఐఎం రాజును నియమించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, డిఆర్‌ఒ జి.నరసింహులు, డిప్యూటీ కలెక్టర్ ఎ.కుమార్, సహాయ ఎన్నికల అధికారులు, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-రాజానగరం

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా వైసిపి కన్వీనర్, రాజానగరం ఎంఎల్ఎ జక్కంపూడి రాజా అన్నారు. చాగల్నాడు ఎత్తిపోతల పథకం కాలువ నీళ్లను కాతేరు సమీపంలో పంప్ హౌస్‌లో వైసిపి రాజమహేంద్రవరం రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్‌తో కలిసి ఎంఎల్ఎ జక్కంపూడి రాజా విడుదల చేశారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ చాగల్నాడు ఎత్తిపోతల పథకం కాలువ ద్వారా ఆయుకట్టు పరిధిలో 20 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. స్వర్గీయ మాజీ సిఎం వైఎస్. రాజశేఖర రెడ్డి ప్రారంభించిన జలయజ్ఞం పథకం వలన సాగునీటి పథకాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. గత ప్రభుత్వం సాగునీటి రంగంపై నిర్లక్ష్యం వహించిందన్నారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని, ఏ ఒక్క రైతు నీటి కోసం ఇబ్బంది పడకూడదని తెలిపారు. కార్యక్రమంలో కోరుకొండ జెడ్‌పిటిసి సభ్యుడు కర్రి.నాగేశ్వరరావు, సీతానగరం ఎంపిపి గుర్రాల జోత్స్న, సీతానగరం మండల కన్వీనర్ గంటా శ్రీను, కోరుకొండ మండల కన్వీనర్ ఆడపా కనకరాజు, జిల్లా రైతు విభాగ అధ్యక్షులు అడబాల చినబాబు, ఇఇ రంగా రావు, ఇరిగేషన్ డిఇలు ఆనంద్ బాబు, వెంకట్రావులు, ఇరిగేషన్ ఎఇ శివప్రసాద్, ఇరిగేషన్ జెఇలు వినోద్, సుమంత్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.



నీరు విడుదల చేస్తున్న ఎంఎల్ఎ రాజా, చందన నాగేశ్వర్

సాగునీరు విడుదల

సీతానగరం రాజానగరం నియోజకవర్గంతో పాటు వివిధ మెట్ట నియోజక వర్గాలకు సాగు నీరందించే కార్యక్రమంలో భాగంగా చాగల్నాడు, కొత్తవెంకటనగరం ఎత్తిపోతల పథకం నుండి రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ తో కలిసి రైతులకు సాగునీరు విడుదల చేశారు. అనంతరం తొర్రిగడ్డ,పుష్కర ఎత్తిపోతల పథకాల నుంచి దిగువున ఉన్న ఆయుకట్టుకు సాగునీటిని ఎంఎల్ఎ రాజా విడుదల చేశారు. ముందుగా ఆయా పథకాల వద్ద సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి,నీటిని విడుదలచేశారు.

పేదల సొంతింటి కలే సిఎం జగన్ ధ్యేయం

ఎంపీ భరత్‌రామ్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

పేదల సొంతింటి కల సాకారం చేయడమే సిఎం జగన్ ధ్యేయమని వైసిపి పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. శనివారం నగరంలోని ఆనం కళా కేంద్రంలో 'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్ళు, ప్రధాన మంత్రి ఆవాస్ యోజనా పథకం' కింద సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ఆర్థిక సహాయ మంజూరు పత్రాలను ఎంపీ భరత్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. 223మంది లబ్ధిదారులకు ఈ పత్రాలను ఎంపీ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కో లబ్ధిదారునికి రూ.1లక్షా80వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తాయని తెలిపారు. అలాగే గహనిర్మాణానికి అవసరమైన ఇసుక, ఐరన్, సిమెంట్ తదితర మెటీరియల్ ను సబ్సిడీ పై అందజేసి సహకరించనున్నట్టు తెలిపారు. సిఎం జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాలలో అర్హులైన పేదలు 32 లక్షల మందికి సొంత గూడు కల్పించాలని సిఎం జగన్ ఎంతో పట్టుదలతో ఉన్నారని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎటువంటి ఇబ్బందీ లేకుండా సమర్థవంతంగా



లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎంపీ భరత్

అర్హులైన పేదలందరికీ అందుతున్నాయంటే దానికి కారణం వాలంటీర్ వ్యవస్థ, సచివాలయ వ్యవస్థ కారణమని అన్నారు. ప్రస్తుతం మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ళను నిర్మించుకోవాలని, దశల వారీగా వారికి ప్రభుత్వ ఆర్థిక సహాయం అందుతుందని ఎంపీ భరత్ తెలిపారు. ఆయా వార్డు ఇన్చార్జులు దగ్గరుండి లబ్ధిదారులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పి.సత్యవేణి, జిల్లా గహనిర్మాణ శాఖ అధికారి జి.పరశురామ్, హౌసింగ్ డిఇఇ కె.సూరిబాబు, హౌసింగ్ ఎఇ కె.ఉమాశంకర్, రాజమహేంద్రవరం అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర వైసీపీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, పాలిక శ్రీను, మార్గాని సురేష్, మింది నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపనచేస్తున్నఎంఎల్ఎ శ్రీనివాసనాయుడు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-నిడదవోలు

నిడదవోలు పట్టణం గాంధీనగర్ 16వ వార్డు నందు గల మాలకోడు చెరువు వద్ద 4.33 ఎకరాలలో రూ.87 లక్షల వ్యయంతో నీటివనరులను అభివృద్ధి పరుచు పనులకు శనివారం ఎంఎల్ఎ జి. శ్రీనివాస్ నాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో పట్టణ మున్సిపల్ ఛైర్‌పర్సన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్ యలగడ బాలరాజు, గంగుల వెంకటలక్ష్మి, పడాల శిరీష, గోపిరెడ్డి శ్రీనివాస్, కామిశెట్టి వెంకట సత్యనారాయణ, అహ్మదునీషా బేగం తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని ఓఎన్‌జిసి (డ్రిల్లింగ్) గ్రూప్ జనరల్ మేనేజర్ పి. కేశవ రావు అన్నారు. శనివారం ఓఎన్‌జిసి ఆధ్వర్యంలో సిఎస్ఆర్ కింద స్థానిక సాయినగర్, మాధవ్‌నగర్, ద్వారక నగర్ సమీపంలో వున్న పార్క్ అభివద్ధి కోసం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవ రావు మాట్లాడుతూ, స్వచ్ఛత పక్వాడ లో భాగంగా నగరంలో క్లీన్ అండ్ గ్రీన్ కింద పలు సామాజిక చైతన్య వంతమైన కార్యక్రమాలను చేపడుతున్నామని అన్నారు. అందులో భాగంగా ఇప్పటికే పుష్కర్ ఘాట్, మార్కండేయ ఘాట్ వద్ద నదీ జలాల నుంచి ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలను తొలగించామన్నారు. నగరపాలక సంస్థ తో కలిసి నగరంలో మూడు పార్కులు అభివద్ధి చేసినట్లు పేర్కొన్నారు. ఒక మొక్క నాటి వాటిని పరిరక్షించాలని పిలుపు నిచ్చారు. రానున్న రోజుల్లో



మొక్కలు నాటుతున్న కేశవరావు తదితరులు

మరిన్ని కార్యక్రమాలను నిర్వహించడానికి ఓఎన్‌జిసి ముందుంటుందని అన్నారు.ాలనీ కి చెందిన శివ కనక ప్రసాద, ఓఎన్‌జిసి హెచ్‌ఆర్ జిఎం.రావ్ నవీద్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక కాలనీ వాసులు, ఆర్ఎంసి సిబ్బంది, ఓఎన్‌జిసి అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




డి.అనిత

డిసిఇబి కార్యదర్శిగా అనిత నియామకం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

తూర్పుగోదావరి జిల్లా ఉమ్మడి పరీక్షా విభాగం (డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డ్) కార్యదర్శిగా కాతేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డి.అనితను నియమిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈమె ఉమ్మడి పరీక్షా విభాగానికి చాలాకాలం సభ్యులుగా పనిచేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అనిత ను ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి కోలా సత్యనారాయణ, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు కెవి.రమణ రావు, కార్యదర్శి మంగిన రామారావు ఆర్థిక కార్యదర్శి జివిఎస్.గణపతి రావు, రాష్ట్ర కౌన్సిలర్ టిఎస్.రామానుజన్, పి.మధు సూదన్ రావు,హెడ్ క్వార్టర్ సెక్రటరీ ఎస్‌ఎల్‌వి.రమేష్, జాయింట్ సెక్రెటరీ ఎమ్‌ఎల్. సుబ్రహ్మణ్యం, మహిళా కార్యదర్శి జి.ప్రమీల రాణి, మున్సిపల్ కార్యదర్శి టి.చక్రధర్, ఆడిట్ కమిటీ కన్వీనర్ కె.జయలక్ష్మి, రాజమ హేంద్రవరం డివిజన్ ప్రధాన కార్యదర్శి ముత్యం శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

కార్టూ'నిజం'





మాజీ ఎంఎల్ఎ శేషారావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఘనంగా శేషారావు పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి-ఉంండ్రాజవరం

నిడదవోలు మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు పుట్టినరోజు వేడుకలు ఆయన స్వగ్రామం వేలివెన్నులో శనివారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గానికి చెందిన టిడిపి అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని, ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉండ్రాజవరం, నిడదవోలు, పెరవలి మండలాల టిడిపిఅధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ, వెలగన సూర్యారావు, అతికాల మురళి తదితరులు పాల్గొన్నారు.

దుర్గాబాయ్ దేశ్‌ముఖ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-తాళ్లపూడి

బాలబాలికలకు హిందీ విద్యాబోధన అందించాలన్న ఆలోచనతో రాజమహేంద్రవరంలో హిందీ పాఠశాలను స్థాపించి మహిళా అభ్యున్నతికి కృషి చేసిన దుర్గాబాయి దేశ్‌ముఖ్ జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని రాగోలపల్లి ఎంపిపి పాఠశాల హెచ్‌ఎం దున్నా దుర్గారావు అన్నారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాల ఆవరణలో దుర్గాబాయి చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి-గోపాలపురం

నూజివీడు ఐఐఐటీకి జగన్నాథపురం గ్రామానికి చెందిన పి. హర్షవర్ధని ఎంపికైనట్లు ఎంఇఒ జి. శ్రీనివాసరావు శనివారం తెలిపారు. జగన్నాథపురం ప్రభుత్వ హైస్కూల్లో చదివిన హర్షవర్ధని టెన్త్‌లో 577 మార్కులు సాధించినట్లు తెలిపారు. న విద్యార్థినిని గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

సీతామహాలక్ష్మి దాతృత్వం ఆదర్శనీయం

రూ.4 కోట్ల విలువైన భూమి ఆస్పత్రి నిర్మాణానికి అందజేత

ప్రజాశక్తి-కడియం

ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి రూ.4 కోట్ల విలువైన భూమిని దానమిచ్చిన దాత అన్నందేవుల రామసూర్య సీతామహాలక్ష్మి (భాస్కరం) దాతృత్వం ఆదర్శనీయమని రాజా నగరం ఎంఎల్ఎ జక్కంపూడి రాజా పేర్కొన్నారు. కడియపులంక గ్రామంలో దోసాలమ్మ కాలనీ సమీపంలో ఆసుపత్రి నిర్మాణానికి భూమి పూజ జరిగింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార బ్యాంకు అధ్యక్షులు ఆకుల వీర్రాజు, రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ లు కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. అనంతరం సీతామహాలక్ష్మిని, కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతు



స్థలదాతనుసత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు,నాయకులు

సూర్యప్రకాశరావు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, మండల పార్టీ కన్వీనర్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్, సొసైటీ చైర్మన్ లు తిరుమలశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'మానవత' ఆధ్వర్యంలో ఇన్సులిన్ సిరంజీల అందజేత

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ వారు స్వచ్ఛందంగానే ప్రభుత్వాసుపత్రిలో అవసరమైన ఇన్సులిన్ సిరంజిలను అందజేశారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో దాదాపు రూ.3వేల విలువైన ఇన్సులిన్ సిరంజిలను నల్లజర్ల మానవత అధ్యక్షులు ఐడివి.అప్పారావు, పూర్వపు అధ్యక్షులు, ప్రస్తుత కన్వీనర్ గుళ్లపూడి వెంకటరత్నం ఆధ్వర్యంలో వైద్యాధికారి డాక్టర్ తెల్లం గంగాధరరావు కు అందజేశారు. ప్రభుత్వాసుపత్రిలో అవస రమైన ఇన్సులిన్ సిరంజీల ఆవశ్యకత అవసరం తెలుసుకున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా నియంత్రణ కమిటీ ఛైర్మన్ కండెపు సూర్య నారాయణ స్పందించారు. నల్లజర్ల మండల మానవత నూతన కమిటీకి విషయాన్ని తెలియజేసి ఇన్సులిన్ సిరంజీలను వైద్యశాలకు అందించారు. కార్యక్రమంలో ఆసుపత్రి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పలివెల ప్రసాదరావు, వైద్యఉద్యోగుల సంఘం నాయకులు జివివి.ప్రసాద్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



సిరంజీలు అందిస్తున్న మానవత మూర్తులు

టిడిపి ఆధ్వర్యంలో 'భవిష్యత్తుకు గ్యారంటీ'

ప్రజాశక్తి-గోకవరం

స్థానిక సంజీవయ్య నగర్ లో మండల టిడిపి అధ్యక్షులు మంగ రౌతు రామకృష్ణ ఆధ్వర్యంలో టిడిపి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ వైసిపి పాలనలో నిత్యావసర వస్తువులు ధరలు పెరిగిపోతున్నాయని అన్నారు. కార్యక్రమంలో గున్నూరి లాజరు, మోటపర్తి ఆనంద్, చీకట్ల రాజు, బద్దాని చంటిబాబు, మెప్పిల్లి జయరాజు పాల్గొన్నారు .

వసతి గృహాల్లో దోమల మందు పిచికారీ

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం ప్రభుత్వ వసతి గృహాల్లో డెంగీ మాసోత్సవాల్లో భాగంగా శనివారం దోమల నివారణకు ఎంపిహెచ్‌ఇఒ వైయస్.రాయుడు ఆధ్వర్యంలో దోమల మందు పిచికారి చేశారు. ఆయన మాట్లాడుతూ గోకవరం మండలంలో మొత్తం నాలుగు ప్రభుత్వ వసతి గృహాల్లో దోమల ముందు పిచికారి చేశామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-రాజానగరం

రాజానగరం పిహెచ్‌సిలో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామనిరాజమహేంద్రవరం జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ ఎం.శ్రీహరి బాబు అన్నారు. పిహెచ్‌సి వైద్యాధికారులపై గ్రామ సర్పంచ్, మండల ఉపాధ్యక్షురాలు మండల సర్వసభ్య సమావేశంలో ఆరోపణలు చేశారు. దీనిపై రాజమహేంద్రవరం జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ ఎం.శ్రీహరిబాబు ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు శనివారం విచారణ చేపట్టారు. సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీహరిబాబు మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో మంచినీటి సమస్యలను వెంటనే పరిష్కారం జరిగే విధంగా చర్యలు చేపడతామన్నారు. కుక్క కాటుకు, పాము కాటు ఇంజక్షన్లు ఆందుబాటులో ఉన్నాయన్నారు. దీనికి ఏవిధమైన రికమండేషన్స్ అవసరం లేదని చెప్పారు. ఆసుపత్రి అభివద్ధి కోసం దాతలు ఇచ్చిన నగదును ఎలా ఉపయోగించారు తదితర అంశాలపై ఒక రోజు వచ్చి పూర్తిగా ఇక్కడ ఉండి సమస్యలు పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఆసుపత్రి వైద్యాధికారి రవికుమార్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



డిజిటల్ బోర్డు ప్రారంభిస్తున్న దృశ్యం

డిజిటల్ విద్య అందించడమే ధ్యేయం

ప్రజాశక్తి-తాళ్లపూడి

ప్రతి విద్యార్థికి చిన్నతనం నుండి డిజిటల్ విద్యను అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం విద్యారంగంలో తెస్తున్న మార్పులను ప్రతి విద్యార్థి వినియోగించుకోవాలని వేగేశ్వరపురం గ్రామ సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు అన్నారు. ఈ విద్య కోసం అవసరమైన డిజిటల్ బోర్డులను ప్రభుత్వం మండలంలోని అన్ని పాఠశాలలకు అందజేయడంతో వేగేశ్వరపురం కెఎస్‌ఆర్‌పిహెచ్ పాఠశాల్లో డిజిటల్ బోర్డును శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఇఒ-2 నెహ్రూజీ మాట్లాడుతూ ఇది డిజిటెల్ బోర్డు అయినప్పటికీ సాధారణ బోర్డు లా కూడా ఉపయోగపడుతుందని అంటూ వైఫే ద్వారా యానిమేషన్ వీడియోస్ లైవ్ వీడియోస్ కూడా చూడవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బాలమణి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'లో అర్హులకు ధృవపత్రాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల జగనన్న సురక్ష కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని అర్హులకు ధృవపత్రాలు అందజేశారు. వివరాలు ఇవి..

కొవ్వూరు రూరల్ అర్హులైన ఏ ఒక్కరూ సంక్షేమం పొందకుండా మిగిలి పోకూడదన్న లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని, ఈ కార్యక్రమం వల్ల పేద ప్రజలు కు ఎంతగానో ఉపయోగపడుతోందని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖల మంత్రి డాక్టర్ తానేటి వనిత తెలిపారు. ఈ సందర్భంగా శనివారం కొవ్వూరు పట్టణంలోని ఔరంగా బాద్ సచివాలయ పరిధిలోని 14, 15, 16 వార్డులకు నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ధవీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న 1261 మందికి సంబంధిత పత్రాలను హోంమంత్రి అందజేశారు. సర్టిఫికేట్ సేవలు కాకుండా ఇతర సమస్యలపై స్థానిక ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. చిన్న చిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ముందుగా ఔరంగాబాద్ లోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ.. సిఎం జగన్ ప్రవేశ పెట్టిన వాలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల సర్టిఫికెట్లు లబ్ధిదారుల ఇంటి వద్దకే అందిసుస్తున్నారని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ 11 రకాల సర్టిఫికెట్లను అప్పటికప్పుడే పంపిణీ చేయడం సంతోషదాయకమని తెలిపారు. గతంలో ఏ సర్టిఫికెట్ తీసుకోవాలన్న రోజుల తరబడి నిరీక్షించాల్సిన అవసరం ఉండేదని, ప్రజల కష్టాలు తెలుసుకున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ ఇప్పటికే రాష్ట్రంలో 99 శాతం మంది అర్హులకు పథకాలు అందుతున్నాయని, మిగిలిన ఒక్క శాతం అర్హులకు కూడా జగనన్న సురక్ష పథకం ద్వారా అందిం చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హోం మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ నాయకులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.**చాగల్లు** అర్హులైన ప్రతి ఒక్కరికి నూరు శాతం పథకాలు అందించాలనే లక్ష్యంతో సిఎం జగన్ కృషిచేస్తున్నారని మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. శనివారం చాగల్లు మండలం చాగల్లులో సచివాలయం-1, సచివాలయం-2 పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా 11 రకాల సేవల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు చాగల్లు-1 నుండి 1534 ధృవపత్రాలు, చాగల్లు నుంచి 1422 ధృవపత్రాలను హోంమంత్రి తానేటి వనిత అందించారు. కార్యక్రమంలో ఉన్నమట్ల మనశ్శాంతి, ఎంపిపి మట్ట వీరస్వామి, నియోజకవర్గ నాయకులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.**గోపాలపురం** పేద ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలను ఉచితంగా అందించి వారి అవసరతలను తీర్చడమే జగనన్న సురక్ష లక్ష్యం అని ఎంఎల్ఎ తలారి వెంకట్రావు అన్నారు. శనివారం గోపాలపురం సచివాలయం-2 కు సంబంధించి ఎంపిడిఒ కార్యాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం 800 ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి, జెడ్‌పిటిసి సభ్యురాలు కె.లలిత, అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నాం



ధృవపత్రాలు అందజేస్తున్న గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు



కొవ్వూరులో అర్హులకు ధృవపత్రాలు అందజేస్తున్న మంత్రి వనిత

నేరాలు ఘోరాలు

పలుచోట్ల విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

శనివారం ఉమ్మడి జిల్లాలో విజిలెన్స్ అధికారులు పలు దుకాణాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించినట్టు ఇన్‌ఛార్జి విజిలెన్స్ ఎస్.పి. కె.కుమార్ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా గోపాలాపురం మండలం చిట్యాలలో శ్రీ భవాని ఎంటర్ప్రైజెస్ ఎరువుల దుకాణంలో స్టాక్ వ్యత్యాసం ఉండడంతో షాపు యజమానిపై 6-ఎ కేసు నమోదు చేసినట్టు తెలిపారు. సుమారు రూ.53,000 విలువైన 4.450 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేసినట్టు తెలిపారు. ఈ తనిఖీల్లో డిఎస్‌పి పి.ముత్యాలనాయుడు, ఇన్‌స్పెక్టర్ రమేష్, తహశీల్దార్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి-రాజమచంద్రపురం

కేంద్ర పాలిత ప్రాంతం యానాం నుండి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు యువకులను ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 117 బీర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని సాపిరెడ్డి వీర వెంకట సతీష్ మణికంఠ, పెమ్మిరెడ్డి శివశంకర్ వర ప్రసాద్‌ను అరెస్టు చేశారు. ఎక్సైజ్ శాఖ సిఐ కె.వీరబాబు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని గ్రామాల్లో శనివారం ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ విస్తృత దాడులు నిర్వహించారు. మేర్లపాలెం శివారులో తన సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు.

ట్రిపుల్ ఐటికి విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-కాజులూరు

ట్రిపుల్ ఐటికి నలుగురు విద్యార్థులు ఎంపికైనట్టు కాజులూరు జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం పంపన కృష్ణమూర్తి తెలిపారు. శనివారం కాజులూరు జిల్లా పరిషత్ పాఠశాలలో హెచ్ఎం కృష్ణమూర్తి మాట్లాడుతూ మార్చి నెలలో నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన పూజిత సత్య సాయి (నూజివీడు), కుసుమవల్లి, మొగులూరు వరప్రసాద్, మొండి లోవ సురేష్ (శ్రీకాకుళం) సెంటర్లకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఎంపిపి మాత భారతి మురళి, జెడ్‌పిటిసి వనుం వెంకట సుబ్బారావు, మండల విద్యాశాఖ అధికారులు కె.వివేకానంద, పి.జాన్ అభినందించారు.

వేగవంతంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి -కరప

గ్రామాల్లో పారిశుధ్య పనులను వేగవంతంగా చేయిస్తున్నట్టు మండల పంచాయతీ విస్తరణాధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. జెడ్.భావారం, కొరిపల్లె, నడకుదురు, జి.భావారం, తదితర గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు డ్రైనేజీ పూడికతీతలను తీయించి ముగ్గు, బ్లీచింగ్ వంటి పౌడర్లను చల్లించామన్నారు.

ఇంటింటికీ టిడిపి మినీ మేనిఫెస్టో

ప్రజాశక్తి-కాకినాడ

టిడిపి మినీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేస్తున్నట్టు పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సుంకర పావని తెలిపారు. మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో భవిష్యత్తు గ్యారెంటీ మినీ మేనిఫెస్టో కరపత్రాలను చంద్రబాబుతో ఆవిష్కరింప జేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఇంటింటికీ మినీ మేనిఫెస్టో పథకాలను వివరించాల్సిందిగా చంద్రబాబు ఆదేశించారన్నారు. ప్రస్తుత వైసిపి పాలనలో అన్ని రకాల నిత్యావసర వస్తువులు ధరలు విపరీతంగా పెరిగి సామాన్యులు బతకడమే కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే 2024 ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు రాష్ట్ర ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు.

అభివృద్ధి సంక్షేమాలే టిడిపి లక్ష్యం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

అభివద్ధి, ప్రజా సంక్షేమం కోసం టిడిపిని తిరిగి అధికారంలోకి తీసుకురావాలని కాకినాడ రూరల్ మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. ఎస్.అచ్యుతాపురంలో వస్తున్నా మీ గ్రామానికి మీ అనంతలక్ష్మి కార్యక్రమంలో అనంతలక్ష్మి మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అభివద్ధితోపాటు సంక్షేమ పథకాలను అర్హులైన అందరికీ అందించారనానరు. వైసిపి ప్రభుత్వం వచ్చాక ధరలన్నీ ఆకాశాన్ని అంటాయన్నారు. అభివద్ధి ఎక్కడా జరగలేదని ప్రజల వాపోతున్నారు. మళ్లీ చంద్రబాబును ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కర్రి వెంకటరాజు, సరిదే నాగ హరినాథ్, కోనాల కృష్ణ, నూకల ఉదయ భాస్కర్, వెలుపుకొండ రాంబాబు, లావేటి శ్రీను, కొఠారి తిరుమల రావు, గుండ్రోజు శ్రీనివాస్, గౌతు సూర్యనారాయణ, చింతపల్లి సత్తిబాబు పాల్గొన్నారు.

రిఫ్రెషర్ కోర్సు విజయవంతం

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఒక వారం నిర్వహించిన 'పబ్లికేషన్స్, ప్రాజెక్ట్స్ అండ్ పేటెంట్స్' ఆన్‌లైన్ షార్ట్ టెర్మ్ రిఫ్రెషర్ కోర్సు విజయవంతమైనట్టు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఎన్ఐటిలు, ఇతర విశ్వవిద్యాలయాల నుంచి వివిధ వనరుల వ్యక్తులు ప్రచురణలు, ప్రాజెక్టు మరియు పేటెంట్ల ప్రాముఖ్యతపై ఉపన్యాసాలు ఇచ్చారన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ బి.రామ్మోహన రెడ్డి మాట్లాడుతూ, అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్లతో సహా మొత్తం 140 మంది ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం పొందారని మరియు పరిశోధన మరియు అభివృద్ధి విభాగంలో జ్ఞానాన్ని పొందారని తెలిపారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక14 వ వార్డు చల్లా వారి గరువు కాలనీలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శనివారం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ తాటికొండ వెంకటలక్ష్మి, మున్సిపల్ డిఇ ఆదినారాయణరావు, మున్సిపల్ ఎఇ కృష్ణ జీవ ప్రసాద్, కో ఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ, వైసిపి నాయకులు బొడ్డు ప్రకాష్, తాటికొండ పెదకాపు, బద్ది వీరబాబు పాల్గొన్నారు.

తొలకరి పనులతో కళకళ..

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

తొలకరి వర్షంతో జిల్లాలోని వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. కొంత కాలంగా చినుకు జాడ కోసం నిరీక్షించిన రైతులకు తాజా వర్షాలు ఊరటనిచ్చాయి. జిల్లావ్యాప్తంగా సుమారు 2.50 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరగనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీనిలో అత్యధికంగా 2 లక్షల ఎకరాలు వరి సాగు జరగనుంది. గోదావరి వరదలు, ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు సాగుకు రూపొందించిన కార్యచరణలో ఆచరణలో అమలుకు నోచుకోలేదు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి తూర్పు, పశ్చిమ, మధ్య డెల్టా కాలువలకు జూన్ ఒకటి నుంచి నీరు విడుదల చేసినప్పటికీ రైతులు ముందస్తు సాగుకు వెనకడుగు వేశారు. సాంప్రదాయంగా తొలకరి వర్షం కోసం ఎదురు చూశారు. జలవనరుల శాఖ అధిదకారులు నీరు విడుదల చేసినప్పటికీ శివారు ప్రాంతాలకు ఇప్పటికీ నీరు చేరలేదు. కాల్వల పూడికతీత, ఆధునీకరణ (క్లోజర్) పనులు చేపట్టకపోడమే ఈ దుస్థితికి కారణమని తెలుస్తోంది. వ్యవసాయ రంగంలో నీటి వనరుల నిర్వహణే కీలకమైనది. అటువంటి పనులకు ప్రభుత్వం నిధులు కేటాయించటంలో అనుసరించిన నిర్లక్ష్యం చిత్తశుద్ధిని దర్పణం పడుతోంది. వర్షాలు ప్రారంభమైన అనంతరం కేవలం 17 కోట్లు కేటాయించటం విమర్శలకు దారి తీస్తోంది. కేటాయించిన నిధులు తూటుకాడ తొలగించాలని పేర్కొని ఆధునీకరణను పూర్తిగా అటకెక్కించిన వైనం రైతులను, రైతు సంఘాలను ఆందోళనకు గురి చేసిందనే చెప్పాలి. ఖరీఫ్ ఆలస్యానికి ప్రభుత్వమే కారణమని పలువురు అంటున్నారు.

ప్రహసనంలా సబ్సిడీ టమోటా

ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ టమోటా ప్రహసనంలా మారింది. కూరగాయల ధరలు ఆకాశాన్నంట



తున్న నేపథ్యంలో ప్రజల నుంచి వ్యక్తమవుతున్న వ్యతిరేకతను నిలువరించేందుకు సబ్సిడీ టమోటా పంపిణీ ప్రారంభించింది. ఈ పంపిణీ జిల్లా కేంద్రంలోనే అస్తవ్యస్తంగా మారడం కొనుగోలుదారులను కలవరానికి గురి చేస్తోంది. ఎంపిక చేసిన కొన్ని రైతు బజార్లలో సబ్సిడీ టమోటా విక్రయాలు జరుగుతున్నాయి. ఆధార్ కార్డు నమోదు చేసుకుని అక్కడి అధికారులు కేజీ రూ.10 చొప్పున పంపిణీ చేస్తున్నారు. బహిరంగ మార్కెట్లో ఇప్పటికీ కేజీ రూ.140 ధర ఉంది. ధరతో పోల్చితే కొంత ఊరట లభించిన మాట వాస్తవమేనని చెబుతున్న కొనుగోలుదారులు కేజీ టమోటా కోసం గంటపాటు క్యూలో నిలబడుతున్నామని వాపోతున్నారు. కొన్నిసార్లు కొద్ది మందికి మాత్రమే పంపిణీ చేసి స్టాకు లేదనే బోర్డులు పెట్టడం విస్మయానికి గురి చేస్తోంది. దీంతో ఉదయం నుంచే రైతు బజార్ల వద్ద భారీ క్యూ దర్శనమిస్తోంది. టమోటా సంగతి మినహాయిస్తే ఇతర కూరగాయలు సైతం ఇప్పటికీ ధరలు అందుబాటులోకి రాలేదు. వంకాయలు, బెండకాయలు, చిక్కుడు కాయలు తదితర ఏరకమైనా రూ.50 పై మాటే. ఆకు కూరలు కట్ట రూ.10 చేరడంతో కొనుగోలు దారులకు చుక్కలు కన్పిస్తున్నాయనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కదం తొక్కిన అంగన్‌వాడీలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ అంగన్‌వాడీలు చేపట్టిన ఆందోళనలు మిన్నంటాయి. రాష్ట్ర వ్యాప్తంగా 36 గంటల పాటు ఈ ఆందోళనలు కొనసాగాయి. ఉమ్మడి జిల్లాలలోని కలెక్టరు, సబ్ కలెక్టరు కార్యాలయాల ఎదుట ఆందోళనలు నిర్వహించటంతో పాటు భారీ ర్యాలీలు నిర్వహించారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను సాధించుకునేందుకు జిల్లాల వారీగా చేస్తున్న ఆందోళనలపై ప్రభుత్వంస్పందించలేదు. దీంతో రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపునిచ్చింది. ఈ పిలుపుతో వందలాది మంది అంగన్వాడీలు కదం తొక్కారు. అంగన్‌వాడీలకు మద్దతుగా పలు ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు వెంటనడిచాయి. పాలక ప్రభుత్వాలకు హెచ్చరిక చేశాయి.

గోదావరికి వరద నీరు

ఎగువ రాష్ట్రాలో కురిసిన వర్షాలతో గోదావరి నదికి క్రమ క్రమంగా వరద నీరు చేరుతోంది. గతేడాది ఇదే నెలలో ప్రమాద ఘంటికలు మోగిన విషయం విదితమే. ప్రస్తుతానికి ఆ స్థాయిలో వరద లేనప్పటికీ గత అనుభవాలను గుర్తు చేసుకుని ప్రజలు ఆందోళనకు గురౌతున్నారు. తాజాగా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద 8.75 అడుగుల నీటిమట్టం నమోదైంది. ఎగువ నుంచి 80 వేల క్యూసెక్కుల నీరు వస్తుందనే సమాచారంతో అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యింది. బ్యారేజీ వద్ద ఉన్న 175 గేట్లలో 48 గేట్లు ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తోంది. మరో వైపు గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాజమహేంద్రవరంలో అనేక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. రాబోయే రోజుల్లో గోదావరి వరద నీరు పెరిగితే వర్షపు నీరు నదిలోనికి విడుదల చేసే అవకాశాలు తక్కువే. అధికారులు ఇప్పటికైనా అప్రమత్తమై సైడ్ డ్రయిన్‌లు పూడిక తీత పనులు వేగవంతం చేసి ముంపునుంచి రక్షించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

పంట కాలువ కాదు కెనాల్ రోడ్డే..

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

జిల్లాలో అత్యంత ప్రాధాన్యత గల సామర్లకోట-కాకినాడ కెనాల్ రోడ్డు దుస్థితి ఇలా మారిపోయింది. సామర్లకోట మండలం వికె.రాయపురం - మాధవపట్నం గ్రామాల మధ్య కాకినాడ మెయిన్ రోడ్డుపై వర్షాలుకు తోడు వరద జలాలు ప్రవహిస్తుండడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి కాలువల్లో జలాలు అధిక స్థాయిలో చేరడంతో కాకినాడ మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలువలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో శుక్రవారం రాత్రి నుంచి మాధవపట్నం గ్రామం వద్ద వరద జలాలు మెయిన్ రోడ్డు మీద ప్రవహిస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే గోతుల మయంగా మారిన ఈ రహదారి జలాలతో నిండుకోవడంతో గోతులు కనిపించక ప్రయాణికులు ప్రమాదవసత్తు అదుపుతప్పి గోతుల్లో పడుతున్నారు.


రోడ్డులో నీటి ప్రవాహంలో వాహనాలు

పలువురికి ఆర్థిక సాయం

కొత్తపేట : ఇటీవల అనారోగ్యంతోను, మతిచెందిన కుటుంబాలను ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందించారు కొత్తపేట మండలం వానపల్లి గ్రామానికి చెందిన పట్టా రాజు కుటుంబసభ్యులను పరామర్శించి రూ.20 వేల సాయం అందజేశారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ డయాలిసిస్ చేయించుకుంటున్న వానపల్లి శివారు కోతుల తోటకు చెందిన గుత్తుల సాయిని రూ.10 వేల సాయం అందచేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-ఆలమూరు

సీజనల్ వ్యాధులపై రాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని వైద్యాధికారులు పి.భవానిశంకర్, ఆర్.సుదర్శన్ బాబు, డి.మల్లికార్జున, డి.సువర్చలానాయుడు అన్నారు. పెద్దపళ్ల, చొప్పెల్ల పిహెచ్సి ఆరోగ్య పర్యవేక్షకులు పివి.రమణారావు, వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వారి పర్యవేక్షణలో శనివారం మండలంలోని పలుగ్రామంలో అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఏఎన్ఎం, ఆశావర్కర్లు సహకారంతో స్థానిక ప్రజలకు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులతో పాటుగా కుష్టు వ్యాధి, వ్యక్తిగత పరిశుభ్రత, ఆహార భద్రత అలవాట్లపై వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందుగా మలేరియా,డెంగ్యూ రెండూ దోమల ద్వారా వ్యాపించే వ్యాధులని, ఇవి మరే ఇతర వ్యాధి లేని విధంగా ప్రజలను భయపెడుతున్నాయన్నారు. దోమల సమూహాలు అపరిశుభ్రమైన ఇళ్లకు చేరుకుని భయాందోళనలకు గురిచేస్తాయన్నారు. ఇంటి పరిసర ప్రాంతాలలో వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ మురికి నీటి నిలవలు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ పి. వెంకటరత్నం, రాధాకృష్ణ, వైద్య సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నేడు బోస్ అనుచరుల సమావేశం

ప్రజాశక్తి రామచంద్రపురం

రామచంద్రపురం నియోజకవర్గ ఎంఎల్ఎ, రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు గోపాల కృష్ణ విధానాలకు వ్యతిరేకంగా వైసిపి కార్య కర్తలు సమావేశమవుతున్నారు .ఈ మేరకు ఆదివారం ద్రాక్షారామ సాయి మాధవ ఫంక్షన్ హాల్ లో సమావేశానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు దొంగా శ్రీధర్ విలేకరుల తో మాట్లాడారు.గత నాలుగేళ్లుగా కార్యకర్తలకు అనేక అవమానాలకు గురయ్యారని అన్నారు. బోస్ దయతో గెలిచిన వేణు బోస్ నుకలిసే కార్యకర్తలను పలు విధాలుగా వేధిస్తున్నారని వారిపై తప్పుడు కేసులు బనాయించి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తామంతా వైసిపికి వ్యతిరేకం కాదని కేవలం మంత్రి వేణు కు వ్యతిరేకమన్నారు. ఆయనను వ్యతిరేకించే వందలాది మంది ఈ సమావేశానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంత సంతోషం, పోలినాటి ప్రసాద్, డి.బాల పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న వైసిపి నాయకులు

ఘనంగా డాక్టర్ కెఎల్.రావు జయంతి

ప్రజాశక్తి-కాకినాడ

జెఎన్టియుకె ప్రాంగణంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ భవనంలో శనివారం పద్మభూషణ్ డాక్టర్ కానూరు లక్ష్మణరావు 122వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విసి జివిఆర్.ప్రసాదరాజు మాట్లాడుతూ భావి ఇంజనీర్లు కెఎల్.రావును మార్గదర్శకంగా తీసుకుని దేశ సర్వతోముఖాభివద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేని రోజుల్లోనే ఆయన తన ప్రతిభను చాటి సరికొత్త ఆవిష్కరణలకు నాంది పలికారన్నారు. నిర్మాణ రంగంలో కె.ఎల్.రావు చేసిన సేవలు ఎనలేనివన్నారు. ఈ కార్యక్రమంలో వి.శ్రీరామారావు, ఆర్ఎస్ఐఇఎకె ప్రెసిడెంట్ ఇంజనీర్ ఎన్.కృష్ణారావు, పి.ప్రసాద్, ప్రొఫెసర్ ఎం.రమేష్, వి.జయప్రసాద్ పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిపై అవగాహన

ప్రజాశక్తి -కరప

విద్యార్థులకు మానసిక ఒత్తిడి జయించడం తదితర అంశాలపై జిల్లా మానసిక ఆరోగ్య ప్రోగ్రాం కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్ డాక్టర్ రామారెడ్డి అవగాహన కల్పించినట్లు డాక్టర్ క్రాంతి సౌజన్య తెలిపారు. వేళంగి హైస్కూల్లో శనివారం జిల్లా మానసిక ఆరోగ్య ప్రోగ్రాం కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్ డాక్టర్ రామారెడ్డి, లైఫ్ స్కిల్స్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్, ఎఫెక్టివ్ లెర్నింగ్, డెసిషన్ మేకింగ్‌కి సంబంధించి అంశాలను విద్యార్థులకు వివరించారు.

పిజి సెట్‌లో 'వెంకటేశ్వర' విద్యార్థులకు ర్యాంకులు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

ఎపి స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రా యూనివర్సిటీ నిర్వహించిన ఏపీ పి.జి.సెట్ 2023 ఫలితాలలో స్థానిక శ్రీ వెంకటేశ్వరా కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థులు స్టేట్ టాప్ ర్యాంక్ లు సాధించినటు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కెవిఆర్ఎన్.నరసింహ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టేట్ టాప్ ర్యాంకర్లను కళాశాలలో జరిగిన అభినందన సభలో ప్రిన్సిపల్ కెఎస్‌విఎన్.మనోహర్, ఎఒ కరాటం ప్రవీణ్, ఛైర్‌పర్సన్ మల్లిపూడి విజయ లక్ష్మి, ఆఫీసర్స్ కె.శ్రావణ్ దిలీప్, డా.కె.హేమావిజిత, సీనియర్ లెక్చరర్లు, పలువురు ప్రముఖులు అభినందించారు.

యానాం రోడ్డులో డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టాలి

ప్రజాశక్తి-కాజులూరు

యానాం ద్రాక్షారామ రహదారిలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. శనివారం ఉప్పుమిల్లి కుయ్యేరు కొలంక పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు వాహనదారులు మాట్లాడుతూ ఈ రహదారిలో నిత్యం పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని దీనికి ప్రధాన కారణం మద్యం సేవించడమేనని వారన్నారు. నిత్యం రాజమహేంద్రవరం, రామచంద్రపురం మండపేట పరిసర ప్రాంతాల నుంచి యువకులు ముగ్గురు నలుగురు ఒకే బైక్‌పై వచ్చి యానాంలో మద్యం ధరలు తక్కువగా ఉండడంతో అడ్డూ అదుపూ లేకుండా మద్యం సేవించి తాగుతూ పరిసర ప్రాంత వాళ్లని భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. శని ఆదివారాల్లో వీరికి అడ్డూ అదుపూ లేకుండా పోతుందన్నారు. అధికారులు స్పందించి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించాలని కోరుతున్నారు.

గ్రామీణ విత్తన ఉత్పత్తిపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-అయినవిల్లి

మాగం గ్రామం రెండో నెంబర్ కాలవ గట్టు వద్ద రైతులకు గ్రామీణ విత్తన ఉత్పత్తి పై శిక్షణా కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి వై శోభ అధ్యక్షత జరిగింది జిల్లా వనరుల కేంద్రం నుంచి వ్యవసాయ సహాయకులు రాజశేఖర్ పాల్గొని మాట్లాడుతూ ఈ పథకనికి ప్రభుత్వం 50 శాతం రాయితీతో ఫౌండేషన్ విత్తనాలను రైతులకు అందిస్తుందన్నారు. దీని ద్వారా రైతులు తమ విత్తనాలను తామే తయారు చేసుకోవాలన్నారు. విత్తనానికి విత్తన శుద్ధి చేసుకోవాలని విత్తన శుద్ధి ద్వారా శ్రమించే వ్యాధులు మరియు తెగులను కొంతవరకు నివారించవచ్చునని అన్నారు. నారుమడులలో ఎరువుల యాజమాన్యం పురుగులు, తెగుళ్ల సోకకుండా రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆత్మ నుంచి డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ జ్యోతిర్మయి పాల్గొని పర్యావరణ పరిరక్షణ గురించి వివరించారు ఈ కార్యక్రమంలో ఎఒ మనోహర్, విహెచ్ఎ జీవనసుధ రైతులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

గృహ నిర్మాణ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గానికి సంబంధించి గహ నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు సంస్థ క్లియరెన్స్ బోర్డు ఆధ్వర్యంలో స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయంలో ఆర్ఎఒ శనివారం చెక్కులు పంపిణీ చేశారు. మూడు విడతలకు సంబంధించి 53 మంది లబ్ధిదారులకు సుమారు రూ.58 లక్షల 80 వేలు వారి బ్యాంక్ ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు.

ఉషారాణి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - యానాం

యానాం డైరెక్టర్ ఆఫ్ అకౌంట్స్ అండ్ ట్రెజరీస్ డిప్యూటీ డైరెక్టర్‌గా వినకోటి ఉషారాణి అదనపు బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ప్రజాపనుల శాఖలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా ఆమె విధులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆర్థిక శాఖ కార్యదర్శి రత్న ఘోష్ కిషోర్ ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన ఉషారాణి మర్యాదపూర్వకంగా ఆర్ఎఒ మునిస్వామిని కలిశారు.

ఘనంగా విద్యార్థుల దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

పెరుంతలైవర్ కామరాజర్ జయంతిని పురస్కరించుకుని విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలోని విద్యార్థుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పుదుచ్చేరి ప్రభుత్వం ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఆర్ఎఒ మునిస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లాడి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రాంతీయ విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్, ఎస్ఆర్‌కె ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ వరుగు భాస్కర్ రెడ్డి, ఎడిపిసి కమిడి ప్రభాకర్ రావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.

కో-ఆపరేటివ్ సిబ్బంది దీక్ష విరమణ

ప్రజాశక్తి - యానాం

కో ఆపరేటివ్ స్టోర్స్ సిబ్బంది తమ 30 నెలల బకాయి వేతనాల కోసం చేపట్టిన దీక్షను శనివారం విరమించారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఉద్యోగ సంఘాల ఫెడరేషన్ యానాం అధ్యక్షుడు చెల్లి గోపీనాథ్, రాష్ట్ర బిసి సేన ప్రధాన కార్యదర్శి మల్లాడి సత్తిబాబు సిబ్బందికి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేశారు. అనంతరం పరిపాలనాధికారి మునిస్వామిని కలిసి తమ సమస్యలను వివరించారు. ఐదు రోజులుగా పుదుచ్చేరి ఉన్నతాధికారులు, నాయకులతో మాట్లాడుతున్నానని త్వరలో సమస్యలు పూర్తిగా పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నామని హామీ ఇచ్చారు. శనివారం దీక్షా శిబిరం వద్ద పలువురు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ ఐదు రోజులు ఆందోళనకు తమకు సంఘీభావం తెలిపిన అందరికీ కృజ్ఞతలు తెలియజేశారు.